వైఎస్ఆర్ కడప
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 08 మే 2026




## ప్రొద్దుటూరుకి అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు మంజూరు

రాజంపేట, మే 7 ప్రభాతవార్త

పసిడిపురి ప్రొద్దుటూరి పట్టణానికి ఎనిమిదవ అదనపు జిల్ల సెషన్స్ జడ్జి కోర్టు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభా దేవి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం కొత్తగా 25 సివిల్ జడ్జి కోర్టులనుమంజూరు చేసింది. అందులో భాగంగా కడప జిల్లాలో ప్రొద్దుటూరుకు కూడా కొత్త కోర్టు మంజూరు అయింది. దీంతో ప్రొద్దుటూరు పట్టణంలో కేసుల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంది.





కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న అన్నమయ్య కడప, జిల్లాల కలెక్టర్లు

# కొనసాగుతున్న సీఐడీ విచారణ

- 3వ రోజు హాజరైన అప్పటి మున్సిపల్ కమిషనర్ రాధా

ప్రొద్దుటూరు క్రైం, మే 6, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో విచారణ చేస్తున్న సీఐడీ అధికారుల ఎదుట గురువారం అప్పటి మున్సిపల్ కమిషనర్ ఎం.రాధా హాజరయ్యారు. ప్రైవేటు స్థలంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేసేందుకు ఎలా అనుమతులు ఇచ్చారన్న విషయంపై సీఐడీ అధికారులు సీఐడీ అధికారులు రాధాను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మెడికల్ శాఖలో నాన్ టీచింగ్ సెక్షన్‌లో మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో నాన్ టీచింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న రాధా కడప జిల్లా మెప్మా పీడీగా మొదట బాధ్యతలు చేపట్టి తరువాత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. 2020లో జరిగిన రోడ్డు నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర హైకోర్టులో స్థల యజమానులు వేసిన పిటీషన్‌లో జరిగిన రోడ్డు నిర్మాణ పనికి సంబంధించి రాష్ట్ర హైకోర్టులో స్థల యజమానులు వేసిన పిటీషన్‌తో నిధులు దుర్వినియోగంపై హైకోర్టు తీవ్రంగా స్పందించి విచారణకు సీఐడీ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

### భూమి తగాదా కేసులో మేనల్లుడికి

# రెండేళ్ల జైలు శిక్ష

రూ.2 వేల జరిమానా విధింపు

పులివెందుల కోర్టు తీర్పు

పులివెందుల, మే 7 ,ప్రభాత వార్త :

భూమి తగాదా నేపథ్యంలో తన మేనమామపై దాడి చేసి గాయపరిచిన కేసులో ముద్దాయికి పులివెందుల కోర్టు రెండేళ్ల కారాగార శిక్ష మరియు 2 వేల రూపాయలు జరిమానా విధించింది. పులివెందుల పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ 33/2016లో ఐపీసీ సెక్షన్ 324 ఆర్/డబ్ల్యూ 34 కింద నమోదైన కేసులో ఏ 1 ముద్దాయి ఎర్రగుళ్ల ఈశ్వర్ రెడ్డి (తండ్రి: వెంకట శివారెడ్డి), స్వగ్రామం ఎర్రవంకపల్లి, నల్లమడ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా, ప్రస్తుతం కొత్తపల్లి గ్రామం, పులివెందుల మండలం నివాసి. భూమి వివాదం కారణంగా తన మేనమామ తలపై దాడి చేసి రక్తగాయాలు చేసిన ఘటనపై అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన రాజశ్రీ పులివెందుల మేజిస్ట్రేట్ శ్రీ ఎం. చంద్రశేఖర్ రెడ్డి గురువారం కేసు పూర్వాపరాలను పరిశీలించి ముద్దాయికి రెండేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు విచారణలో సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరు పరచడంలో కోర్టు కానిస్టేబుల్ కీలక పాత్ర పోషించారు. అలాగే పులివెందుల అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ జి. మధుసూదనాచారి సమర్థవంతంగా వాదనలు వినిపించి ముద్దాయికి శిక్ష పడేలా చేశారు.



### ట్రాఫిక్ నియంత్రణపై అధికారులతో

# ఎమ్మెల్యే వరద సమీక్ష

ప్రొద్దుటూరు మే 7 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసు శాఖ మరియు మున్సిపల్ అధికారులతో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులలో ఉండే షాపింగ్ కాంప్లెక్స్ ల నందు ద్విచక్ర వాహనాల పార్కింగ్ కొరకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు వ్యాపారాలకు వచ్చే వ్యాపారస్తులు దుకాణాల బయట వాహనాల పార్కింగ్ ను అదుపు చేస్తే ట్రాఫిక్కు కు అంతరాయం కలగకుండా ఉంటుందన్నారు ప్రధాన గాంధీ రోడ్డు లోని ఆసుపత్రుల ప్రాంతాలలో ఆటోలు బైక్లు పార్కింగ్ చేయకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు శ్రీరాముల పేట హోమోస్ పేట రోడ్డు మధ్యలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ ను అదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు వాహనదారులు రోడ్లకు అడ్డంగా పార్కింగ్ చేయకుండా పోలీసు శాఖ మహికులలో అనౌన్స్ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తక్షణమే ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వరద ఆదేశించారు ఈ సమీక్ష సమావేశంలో ఎస్పీ విభూ కృష్ణ మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సురేష్ రెడ్డి రాష్ట్ర షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మరియు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి ఎస్ ముక్తియార్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురాం రెడ్డి మాజీ జెడ్పిటిసి తోటా మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు నల్లబోతుల నాగరాజు బేపారి జాకీర్ అహ్మద్ మరియు టిడిపి నాయకులు బచ్చల వీరప్రతాప్ గంటశాల వెంకటేశ్వర్లు ఖలీల్ మున్నా తదితరులు పాల్గొన్నారు.



### 2023 లో జారీ చేసిన వైవీయూ అధ్యాపక పోస్టుల నియామక

# నోటిఫికేషన్ల ఉపసంహరణ

వైవీయూ, మే 07, ప్రభాతవార్త:

2023 సంవత్సరంలో జారీ చేసిన యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపక పోస్టుల నియామక నోటిఫికేషన్ల ఉపసంహరణ జరిగినట్లు విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య పి.పద్మ తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 59 ఉత్తర్వుల ప్రకారం, విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న 118 అధ్యాపక పోస్టుల భర్తీకి గతంలో ఇచ్చిన అనుమతిని వైవియూ కార్యనిర్వాహక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) తీర్మానం ప్రకారం ఉపసంహరించుకోవడం జరిగిందని వివరించారు. అందువలన, సదరు పోస్టుల భర్తీ కోసం 2023 సంవత్సరం అక్టోబర్ 30వ తేదీన జారీ చేసిన అధ్యాపక నియామక నోటిఫికేషన్లు ఉపసంహరణ అయ్యాయన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, దరఖాస్తు రుసుము తిరిగి పొందేందుకు సంబంధించిన సమాచారం కోసం విశ్వవిద్యాలయ వెబ్సైట్ www.yvu.edu.in ని సందర్శించాలని సూచించారు. నూతన నోటిఫికేషన్ల తేదీలు, ఇతర వివరాలు ప్రకటించడం జరుగుతుందని ఆచార్య పద్మ తెలిపారు.

### నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఇద్దరి మృతికి కారణమైన

# నిందితుడికి రిమాండ్

ప్రొద్దుటూరు క్రైం, మే 6, ప్రభాతవార్త:



మైదుకూరు-జమ్మలమడుగు బైపాస్ రోడ్డు శ్రీదేవి కల్యాణ మండపం ఎదురుగా ప్రొద్దుటూరు నగర శివార్లలోని నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి రోడ్డు పక్కన మోటారు సైకిల్ ఆపి నిలబడి ఉన్న ముగ్గురిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయిన నిందితుడు పోతుబోయిన సుమన్ అలియాస్ సుమన్ యాదవ్‌పై కేసు నమోదు చేయడం జరిగింది. ప్రొద్దుటూరు రూరల్ సీఐ ఎం.నాగభూషణ్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాల ఏర్పాటు సాంకేతిక ఆధారాలతో గురువారం ఉదయం నిందితుడిని అరెస్టు చేసి ట్రాక్టరును స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితున్ని కోర్టులో హాజరుపరచగా 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఢీకొట్టి వెళ్లిన కేసులో త్వరితగతిన సాంకేతిక ఆధారాలతో కేసును చేధించిన ప్రొద్దుటూరు రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్సైలు శ్రీకాంత్, కేసీ రాజు, సిబ్బందిని ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.






### నేటి నుండి..గండి క్షేత్రంలో

# మహా కుంభాభిషేక మహోత్సవాలు..





వేంపల్లి మే 07 ప్రభాతవార్త

చక్రాయపేట మండలం లో నీ వెలసిన గండి క్షేత్రంలో నేటి నుండి మహా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి మే 8 నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణ ఉత్సవాలు.రూ. 28.05 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా ముస్తాబైన గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం.మే 8న అంకురార్పణతో ప్రారంభం కానున్న మహా కుంభాభిషేక కార్యక్రమాలు.మే 9న విశేషంగా రామ సహస్ర లక్ష తులసి అర్చన కార్యక్రమం.మే 10న భక్తిశ్రద్ధలతో సీతా సహస్ర లక్ష కుంకుమార్చన. మే 11న స్వామివారికి ఆంజనేయ సహస్ర నామ నాగవల్లి దళార్చన. మే 12న హనుమత్ జయంతి సందర్భంగా మూలమూర్తికి సహస్ర కలశాభిషేకం. మే 13న మహా పూర్ణాహుతి, అనంతరం భక్తులకు స్వామివారి సర్వదర్శనం మరియు అన్నదానం,చైర్మన్ కల్లూరి వెంకటస్వామి, ఈఓ పట్టం గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.











# నేటి యువతరానికి ఆదర్శం అల్లూరి


### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

రాజంపేట, మే 7 ప్రభాతవా

తెలుగుజాతి గౌరవించే ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిబింబం, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజుని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు.గురువారం రాజంపేట పట్టణం ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి అల్లూరి వర్ధంతి సందర్భంగా మహనీయుని సేవలు స్మరిస్తూ పూలమాలలు వేసి చమర్తి ఘనంగా నివాళులర్పించారు. జోహార్ అల్లూరి అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పీడిత వర్గాల పక్షాన నిలిచి తెల్ల దొరల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని ,ఆయన బాటలో నేటి యువతరం నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా అల్లూరి వంటి దేశభక్తులను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్ తరాలు తమను తాము గొప్పగా మలుచుకోవాలని జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్ రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నేసుబ్బ నరసయ్య నాయుడు,తెలుగు యువత పట్టణ అధ్యక్షులు నూకల రమేష్ బాబు,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు జగదాభి పాండురాజు, మాజీ మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, శంకర్‌రాజు, శివకుమార్‌రాజు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కె కరీమ్, పలువురు క్షత్రియ సంఘం నేతలు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జగన్మోహన్ రాజు

## నేటి యువతకు అల్లూరి స్ఫూర్తి అవసరం




ఎడ్యుకేషన్ మే 7 ప్రభాతవార్త :

మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న మాట్లాడుతూ, బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలకులకు వెన్నులో వణుకు పుట్టించిన మహా విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు.గిరిజనుల హక్కుల కోసం, దేశ స్వాతంత్రం కోసం కేవలం 27 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు అల్లూరి అని ఆయన పేర్కొన్నారు. సాయుధ పోరాటమే స్వాతంత్ర్యానికి మార్గమని నమ్మి బ్రిటీష్ పాలకులపై ధైర్యంగా యుద్ధం చేసిన అల్లూరి, భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. అత్యల్ప వనరులతోనే బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన గొప్ప నాయకుడిగా అల్లూరి సీతారామరాజు గుర్తింపు పొందారని, సంస్కృతం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం కలిగిన ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమని అంకన్న తెలిపారు. విద్యార్థి యువత అల్లూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మహబూబ్ పిరా, సమీవుల్లా, జగదీశ్వర్ రెడ్డి, రహమతుల్లా, రెహమాన్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీ



వీరాపునాయునిపల్లి మే 07 ప్రభాతవార్త :

మండలంలోని ఎరువుల దుకాణాలను కమలాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్యామ్ బాబుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రిజిస్టర్, స్టాక్ బ్యాలెన్స్, బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డు, మొదలగునవి పరిశీలించినారు. ఎరువులు తప్పనిసరిగా ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎరువులు వాటి ఎమ్మార్పీ ధరలు పట్టిక రైతులకు కనిపించేలా షాపు నందు ఉంచాలని తెలిపారు. ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ ను అప్డేట్ చేయవలెనని, రైతులకు తప్పనిసరిగా బిల్లును ఇవ్వాలని తెలిపారు. ఎరువుల బస్తాలను వాటి బరువును తనిఖీ చేశారు. అలాగే గోడౌన్లలో ఉన్న స్టాక్ ను కూడా పరిశీలించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా మాత్రమే ఎరువుల అమ్మకాలు జరపాలని సూచించారు, అలాగే దుకాణం నందున రైతులతో కూడా ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు.

### ఎమ్మెల్యే వరద, కొండారెడ్డిలపై

## అహంకార వ్యాఖ్యలు చేయడం తగదు

### టిడిపి యువ నాయకులు రసూల్ గౌస్



ప్రొద్దుటూరు మే 7 ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఎంతో రాజకీయ చరిత్ర కలిగి నీతి నిజాయితీకి మారుపేరుగా కొనసాగిస్తున్న ప్రజా నాయకుడు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డిలపై టిడిపి మాజీ ఇంచార్జ్ జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి అహంకార పూరితమైన వ్యాఖ్యలు చేయడం తగదని టిడిపి యువ నాయకులు రసూల్‌గౌస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వరద ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డిలపై ప్రవీణ్ రెడ్డి అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వరద, నంద్యాల కొండారెడ్డిని విమర్శించే స్థాయి శక్తి ప్రవీణ్‌కు లేదన్నారు. ప్రవీణ్‌రెడ్డి విమర్శలు చేసే ముందు నిజా నిజాలు తెలుసుకోవాలని, అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. జిల్లా అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రవీణ్ రాజకీయ చరిత్ర స్వల్పమని అటువంటి వ్యక్తి రాజకీయ కురువృద్ధులు నంద్యాల వరదరాజులు రెడ్డి ఆయన తనయుడు నంద్యాల కొండారెడ్డిని విమర్శంచడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపిలో ఉంటూ ప్రవీణ్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తిగా నిలిచిపోయిన మాట వాస్తవం కాదా అన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి తలారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధికార బలంతో చట్టబద్ధత కల్పించి

## ప్రభుత్వ భూములను కాజేయడమే లక్ష్యం

### మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు మే 7 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అట్ట పద్ధతులేని ప్రభుత్వ భూములకు అధికార బలంతో చట్టబద్ధత కల్పించి కాజేయడమే ఎమ్మెల్యే నంద్యాల వరద, తనయుడు నంద్యాల కొండారెడ్డి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విమర్శించారు. గురువారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వెంకటేశ్వర స్వామి దేవాలయ సమీపంలోని 9 ఎకరాల 68 సెంట్ల ప్రభుత్వ భూమి టిడిపి నాయకులు నంద్యాల కొండారెడ్డి కాజేసే ప్రయత్నం చేస్తున్నారని తాను చేసిన ఆరోపణలు నిజమేనని అంగీకరించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కానీ భూములు కాజేసే ప్రయత్నంలో అసైన్డ్ భూముల హక్కుల దారులకు ఆర్థిక లావాదేవులు జరిపిన వాస్తవాలను ఆయన అంగీకరించకపోవడం దురదృష్టకరమన్నారు. నంద్యాల కొండారెడ్డి చేసిన వ్యాఖ్యలలో చట్టబద్ధత ఉంటే మేము ఆ భూములను తీసుకోవడానికి వెనకాడమని అక్కడ అంత భూమి లేదన్న వాస్తవాలను అంగీకరించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. కానీ వారి మధ్య ఆర్థిక లావాదేవీలు జరగలేదన్న అసత్యాలను కొండారెడ్డి మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. విలేకరులు అడిగిన ఎస్ఎస్ మాల్ షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డారని ప్రవీణ్ చేసిన విమర్శలకు ఆయన సమాధానమిస్తూ సింహం గాడిద నక్క కుందేలు కథను ప్రజలకు వివరిస్తూ ప్రవీణ్ రెడ్డి వ్యాఖ్యలకు తాను సమాధానమిచ్చే స్థాయి ఆయనకు లేదన్న విషయాన్ని ఆ కథలో చెప్పకనే చెప్పారు.

## 15న మండల సర్వసభ్య సమావేశం

సిద్ధవటం మే 7 ప్రభాతవార్త

ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి మాట్లాడుతూ ఏప్రిల్ 15 మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఎంపీపీ సవా భవనంలో ఉదయం 10:30కు జరుగుతుందని ఈ సమావేశానికి మండల అధికారులు సింగల్ విండో అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్ సర్పంచులు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, మండల అధికారులు 90 రోజుల ప్రగతి నివేదిక తీసుకొని రావాలన్నారు.

# పత్తి పంటలో రసం పీల్చే పురుగులను నివారించండి

వీరాపునాయునిపల్లి, మే 07,ప్రభాతవార్త :



ప్రస్తుతం సాగులో ఉన్న పత్తిపంటలో రసం పీల్చే పురుగులను నివారించాలని, కమలాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. అయన గురువారం యన్.పాలగిరి గ్రామంలో మండల వ్యవసాయధికారి శ్యామ్ బాబుతో కలిసి పత్తి పంట పొలాలను పరిశీలించారు. పత్తి పంటలో రసం పిల్చే పురుగుల తాకిడి ఎక్కువగా ఉందని, ప్రదానంగా తెల్ల దోమ అధికంగా ఉందని, నివారణకు డై ఫెంతురాన్ 1.25 గ్రా ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే సూక్ష్మ దాతు లోపాలను సవరించుకొవాలని, పత్తి లో ప్రదానంగా మెగ్నీషియం మరియు బోరాన్ లోపాలు గమనించడం జరిగిందని, వాటికి సరియైన నివారణ చర్యలు చెప్పటాలని తెలిపారు. మెగ్నీషియంలోప నివారణకు లీటరు నీటికి 10గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ పైరు వేసిన 45 మరియు 75 రోజుల తరువాత రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. బోరాన్ లోప నివారణకు పైరు వేసిన 60 మరియు 90 రోజుల తరువాత లీటరు నీటికి 11.5గ్రా. బోరాక్స్ వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చెయ్యాలి. అలాగే గులాబీ రంగు పురుగు ఆశించకుండా పక్షిస్థావరాలను మరియు లింగా ఆకర్షగా బుట్టలను కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 60 రోజుల పంటకు వేప నూనె పిచికారీ చేసుకోవడం వలన గుడ్డు దశలోనే నివారించవచ్చని సూచించారు. పై సూచనలు పాటించడం వలన రైతులకు పురుగు మందుల ఖర్చులు తగ్గడమే కాకుండా పర్యావరణానికి మేలు చేసినట్లువుతుందని తెలియచేసారు. ఏ పంటకైనా పూత దశ కి ముందు 19.19.19, పూత తరువాత 13.0.45 ఎకరాకు ఒక కేజీ చొప్పున పిచికారీ చేసుకొనట్లయితే మొక్కలు బెట్ట పరిస్థితులను తట్టు కోవడమే కాకుండా మొక్క ఎదుగుదలకు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది స్వప్న మరియు రైతులు పాల్గొన్నారు.

## చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

### రైతులకు పొంచి ఉన్న ప్రమాదం



సిద్ధవటం, మే 7 ప్రభాతవార్త

రైతుల పంట పొలాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉండడంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు విద్యుత్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని రైతులు తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ శివారులోని రైతుల పొలాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఈ సందర్భంగా ఆ ప్రాంత రైతులు గురువారం మాట్లాడుతూ విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయి విద్యుత్ తీగలు పంట పొలాల్లో వేలాడుతూ ఉన్నాయని పలుమార్లు సమస్య పరిష్కారం చేయాలని విద్యుత్ సిబ్బందికి తెలిపిన పరిష్కారం కాలేదని ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని రైతులు తెలిపారుఈ విషయమై విద్యుత్ ఏఈ జయచంద్ర వివరణ కోరగా సిద్ధవటం గ్రామ శివారులోని పంట పొలాల్లో క్రిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత సిబ్బందికి తెలిపామని పంట పొలాల్లో విద్యుత్ స్తంభం దెబ్బతిని ఉందని రైతులకు ఇబ్బంది లేకుండా తగు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్



చాపాడు. మే 7.ప్రభాతవార్త :

స్థానిక పోలీస్ స్టేషన్ యందు గురువారంఎస్సై చిన్న పెద్దయ్య ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోకు సంబంధించిన అర్హత పత్రాలు పూర్తిస్థాయిలోకలిగి ఉండడంతోపాటుడ్రైవింగ్ లైసెన్స్, యూనిఫామ్ తప్పనిసరి అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ప్రతి ఆటోకు పోలీస్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రానికి వాటర్ కూలర్ విరాళం.



మైదుకూరు, మే 07, ప్రభాతవార్త:

మైదుకూరు మండలంలోని చిన్నయ్యగారి పల్లె పట్టణ ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలు పేషంట్స్ సౌకర్యార్థం ప్రముఖ దాతలు చీమల బ్రహ్మానందరెడ్డి మరియు గోపాల్ రెడ్డి ఉదారత చాటుకున్నారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రజల తాగునీటి అవసరాల కోసం తమ సొంత నిధులతో ఒక వాటర్ కూలర్‌ను విరాళంగా అందజేశారు. గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ వాటర్ కూలర్‌ను పట్టణ ఆరోగ్య వైద్యాధికారిణి డాక్టర్ బి. సుమధుర ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమధుర మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక గ్రామస్తులు మరియు దాతల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి నీది కాదు రాచమల్లు

సుండుపల్లె, మే 07, ప్రభాతవార్త:



మండల పరిధిలోని టిడిపి పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చప్పిడి.మహేష్ నాయుడు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొద్దుటూరు మాజీ ఏంఎల్ఎ రాచమల్లు. శివప్రసాద్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతు సుండుపల్లెకి వచ్చే శక్తి నీకు లేదు...నన్ను ప్రొద్దుటూరుకు రమ్మంటవా.... కడపకు రమ్మంటావా అని ఆయనకు సవాల్ విసిరాడు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతు భూకబ్జాలు, దోపిడీలు,అవినీతికి కేరాఫ్ అయిన నీవు చంద్రబాబుపైన నాపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. అవినీతి, భూకబ్జాలకు, హత్యలకు పాల్పడే నీచమైన చరిత్ర కలిగిన వారికి పదవులు ఇచ్చిన ఆర్థిక నేరగాడు మీ జగన్ మోహన్ రెడ్డి అనిఆరోపించారు. మీలాంటి అవినీతి పరులు వల్లే ఈ రోజు రాష్ట్రంలో ప్రతి పక్ష హోదా కూడా లేకుండా ప్రజా తీర్పు ఇచ్చినప్పటికీ మీ పార్టీ శ్రేణుల్లో మార్పు రాకపోవడం సిగ్గు చేటన్నారు. నన్ను అక్రమ కేసుల్లో నేను శిక్ష అనుభవిస్తే మీ జగన్ మోహన్ రెడ్డి 16 నెలలు ఏ పోరాటం చేసి శిక్ష అనుభవించాడో అనే విషయం ప్రపంచ మంతా తెలుసున్నారు. సీఎం చంద్ర బాబు నాయుడు ఎటువంటి అవినీతినీ ప్రోత్సహించనందు వలన ఈ రోజు రాష్ట్రంలో ముందుకు వెళుతున్నారన్న విషయం మీరు గ్రహించండి రాచమల్లు.నా వ్యక్తిత్వం,నేను కష్ట పడే విధానాన్ని సుండుపల్లి మండలం లో ఉన్నటువంటి వైసీపీ శ్రేణులను అడిగి తెలుసుకోవాలని హెచ్చరించారు. ఈ రోజు నువ్వు చేసిన అసత్య ఆరోపణలు రుజువు చేయి లేకుంటా నేను మీడియా సమావేశంలో వెల్లడించిన ప్రతి దానికి ఆధారాలతో రుజువు చేస్తాను సవాల్ కు నువ్వు సిద్ధమా అని అన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మసముద్రం సింగిల్ విండో అధ్యక్షులు రామనాథరెడ్డి గ్రామాధ్యక్షుడు సుబ్బరామ, మడితాడుబాష తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర చికిత్స సమయంలో రక్తదానం

మైదుకూరు, మే 07, ప్రభాతవార్త:



మైదుకూరు పట్టణ ప్రొద్దుటూరు రోడ్డు బురుగోళ్ల చిన్న అత్యవసర చికిత్స సమయంలో ఒక మహిళకు బి.పాజిటివ్ రక్తం ఇవ్వడం జరిగింది. అత్యవసర చికిత్స పరిస్థితుల్లో సకాలంలో స్పందించి రక్తం ఇచ్చిన బురుగోళ్ళ చిన్నకు వైద్యం పొందుతున్న వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బరుగోళ్ళ చిన్న మాట్లాడుతూ అత్యవసర చికిత్స పరిస్థితుల్లో ఎవరైనా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రక్తం ఇవ్వడంలో ఎలాంటి అపోహాలు అవసరం లేదని వైద్యం పొందుతున్న వ్యక్తులకు అత్యవసరమైతే సమయానికి రక్తం ఇవ్వాలని కోరారు.

## నేటి నుంచి ఏపీపీజీసెట్

వైవీయూ, మే 7, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీపీజీసెట్) ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు కడప నగరంలోని కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుందని యోగి వేమన విశ్వవిద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి. లక్ష్మి ప్రసాద్ తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థుల సౌకర్యార్థం ఆయన పలు వివరాలు వెల్లడించారు. ఈనెల 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు సైకాలజీ సబ్జెక్టుతో పరీక్షలు ప్రారంభవుతాయన్నారు. 9, 10, 11 తేదీలలో ప్రతిరోజు 3 సెక్షన్లలో ఉదయం 9 గంటలకు మధ్యాహ్నం 12:30 గంటలకు సాయంత్రం 4 గంటలకు పరీక్షలు సబ్జెక్టుల వారిగా ఉంటాయన్నారు. విద్యార్థుల హాల్ టికెట్లలోని సమయాన్ని గమనించి సకాలంలో హాజరుకావాలని సూచించారు. కేఎస్ఆర్ఎం కళాశాల కేంద్రంగా నాలుగు రోజులపాటు జరిగే పరీక్షలకు 859 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు.

## హరిప్రసాద్‌ను సన్మానించిన డాక్టర్ల బృందం



సిద్ధవటం మే 7 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా బాలిశెట్టి హరి ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేసి కడపకు విచ్చేసిన సందర్భంగా ఆయనను గురువారం నగరంలోని శ్రీకృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్ ఆవరణలో ప్రధాన వైద్యులు బండారు బ్రిజేష్ కృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు శాలువ కప్పి పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ హరిప్రసాద్ పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం ఉన్నత పదవిని అప్పగించిందని ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా ఆయన ముందుకెళ్లాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ డాక్టర్ తేజస్విని డాక్టర్ భవ్య డాక్టర్ అనూష గోపాలస్వామి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ రిటైర్డ్ ప్రిన్సిపల్ బండారు రాజగోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విప్లవ జ్వాల అల్లూరి స్ఫూర్తిని రగిలిద్దాం



వేంపల్లి ,మే: 07 ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు 102వ,వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం ఐదు నిమిషాలు జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్. హరీష్ మోనం పాటించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని,ఆయన ఆరిపోని ఒక "విప్లవాగ్ని జ్వాల" దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారిని గడ గడ లాడించిన మహనీయుడని కొనియాడారు.అల్లూరి వీర మరణం దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య కాంక్షను రగిలించిందని,'స్వాతంత్రం మే నా జన్మహక్కుఖిఅనే నినాదంతో పోరాటాలు ఉవ్వెత్తున ఎగిసేలా చేశారని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పెదపల్లి సుధీర్‌రెడ్డి, పసుపులేటి శ్యామ్,దేవా, ముక్తార్, ఇదుపులపాయ జయచంద్ర, తామస్, అంజి తదితరులు పాల్గొన్నారు.

### తులసి రెడ్డిని గండి కుంభాభిషేక

## మహోత్సవానికి ఆహ్వానించిన ప్రధానార్చకులు

వేంపల్లి:మే 07 ప్రభాతవార్త

పులివెందుల నియోజకవర్గం, చక్రాయపేట మండలం గండి క్షేత్రం శ్రీ శ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం కుంభాభిషేకమహోత్సవం మే 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతుంది.ఈ మహోత్సవానికి రావలసిందిగా రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మెన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డిని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ కేసరి స్వామి ఆహ్వానించారు. తప్పకుండా హాజరు అవుతారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసి రెడ్డి అన్నారు.



## వన్ మంత్ వన్ విలేజ్ గ్రామ సభ



చిన్నమండెం, మే 7, ప్రభాతవార్త:

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని బోనుమల గ్రామంలో గురువారం వన్ మంత్ వన్ విలేజ్ గ్రామ సభ తహసీల్దార్ రామాంజులు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో ఒక నెల పాటు ప్రతి గురువారం 4 వారాల పాటు నిర్వహిస్తామన్నారు. ఈ గ్రామ సభను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు.అడంగల్ రాని వారు.మ్యూటెషన్,బాగ పరిష్కారాలు కానీ వారు ఇంకా ఎలాంటి భూ సమస్యల వున్నా ఈ గ్రామసభల ద్వారా పరిష్కారం చూపడం జరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో,ఆర్ ఐ శిల్పా మండల సర్వేయర్ శ్యామల,మండల టీడీపీ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప, చెన్నకృష్ణా రెడ్డి వెంకట్రామిరెడ్డి,రాజారెడ్డి గ్రామ విఆర్ఓ ప్రజలు పాల్గొన్నారు.

## పరిపాలనలో మార్పులకనుగుణంగా పనిచేయాలి : డిఎల్‌పిఓ నాగరాజ



కార్యదర్శులతో మాట్లాడుతున్న డిఎల్‌పిఓ నాగరాజ

చౌడేపల్లి, మే 7 ప్రభాతవార్త

పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రభుత్వం తెచ్చిన మార్పులకు అనుగుణంగా పనిచేయాలని డిఎల్‌పిఓ నాగరాజ అన్నారు. స్థానిక పరిపాలనా భవనంలో మండల స్థాయి కార్యదర్శుల సమావేశం జరిగింది. ఇంటి పన్నుల వసూళ్ళల్లో బకాయిదారులకు కల్పించిన 5శాతం రాయితీపై అవగాహన కల్పించాలన్నారు. అన్ని లావాదేవీలు అంతర్జాలయంలో చేయాల్సి వుంటుందన్నారు. పన్నుల వసూళ్ళపై శ్రద్ధ చూపి వేగవతం చేయాలన్నారు. వీటితో పాటు పంచాయతీలకు చెందిన రికార్డులను ఎప్పటికప్పుడు సన్నద్ధంగా వుంచుకోవాలన్నారు. లేని పక్షంలో పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం కార్యదర్శుల్లో నెలకొనివున్న పలు సమస్యలను నివృత్తి చేసారు. డివైఎంపిడిఓ ఎస్.ఎ.గఫూర్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పందికుంట బస్టాప్ వద్ద రోడ్డు ప్రమాదం

### వ్యక్తికి తీవ్ర గాయాలు

గాలివీడు, మే 7, ప్రభాతవార్త:



మండలంలోని పందికుంట బస్టాప్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.గ్రామస్తుల కథనం మేరకు పందికుంట గ్రామం వెంకటాపురానికి చెందిన పల్లపు మహేష్ (35), తండ్రి వెంకటయ్య, తన పల్సర్ బైక్ పక్కన నిలబడి ఉండగా అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో కిందపడిన మహేష్ గాయాల పాలయ్యాడు.ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. గాయపడిన క్షతగాత్రున్ని వెంటనే రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

## జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధికి పటిష్టంగా అమలు

### సిఎం సమీక్షలో జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

మదనపల్లె, మే 7 ప్రభాతవార్త :



అన్నమయ్య జిల్లా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే విధంగా 2047 విజన్ ప్రణాళికలను పటిష్టంగా అమలు చేసే విధంగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించారు. గురువారం విజయవాడ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన ఏడవ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు,ఆశయాల మేరకు సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, జిఎస్‌డిపి లక్ష్యాలు, కీ పార్మంట్స్ ఇండికేటర్లు, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో లక్ష్యం మేరకు వందశాతం ప్రగతిసాధనకు కృషి చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లాలో అమలు చేసిన జలధార కార్యక్రమం వల్ల భూగర్భజలాలు పెరగడం మాత్రమే కాకుండా ప్రజల జీవన విధానం మారుతుందన్నారు. పాడిపరిశ్రమ, మద్య, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానపంటల సాగు పెంపు, రైతుల ఆర్థిక ఆధాయం మెరుగుపడే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్ళేలా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రమంత్రులు, ఛీఫ్ సెక్రటరీ, ఆయాశాఖల ప్రధాన కార్యదర్శులు, కలెక్టర్లు పాల్గొన్నారు.

## పెన్షనర్స్‌కు డియర్‌నెస్ రిలీఫ్ అందరికి అందజేయాలి

### జిల్లా సిటిజన్స్ అధ్యక్షులు డాక్టర్ మునిగోపాల్‌క్రిష్ణ



మదనపల్లె, మే 7 ప్రభాతవార్త :

రాష్ట్రంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వ పెన్షనర్స్‌కు జనవరిలో చెల్లించాల్సిన 30నెలల డిఆర్ బకాయిలు(డియర్‌నెస్ రిలీఫ్) బకాయిలు కొందరికి చెల్లించి, మరి కొందరికి చెల్లించలేదని అన్నమయ్య జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మునిగోపాలక్రిష్ణ తెలిపారు. గురువారం సీనియర్ సిటిజన్స్ నాయకులు పట్టణంలోని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి లోకేష్‌బాబుతో కలసి రిలీఫ్ బకాయిలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ పెన్షనర్స్‌కు డియర్‌నెస్ రిలీఫ్ అందరికి అందజేయాలని డిమాండ్ చేశారు. మార్చి నెలలో విన్నవించినా ఇంతవరకు ఏటిఓ లోకేష్‌బాబు 34మందిపెన్షనర్లకు అందాల్సిన డియర్‌నెస్ బకాయిలు 30నెలలది చెల్లించాలని అభ్యర్తించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ట్రెజరీ అధికారి, ఎస్‌టిఓ నరేష్ మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను త్వరలోనే జమ చేస్తామని తెలియజేసినట్లు అధ్యక్షులు మునిగోపాలక్రిష్ణ తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, జాయింట్ సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ కుమారస్వామి, శ్రీనివాసులు, టిఎస్ఎ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నెలరోజులు 4సందర్శనలతో భూపరిష్కారాలు : పార్వతి

**ఎ.కొత్తకోట(చౌడేపల్లి), మే 7 ప్రభాతవార్త**

నెలరోజులు నాలుగు సందర్శనలతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ భూపతి పార్వతి అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోట స్వర్ణగ్రామంలో నెలరోజులు, నాలుగు సందర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెలలోని ప్రతి గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి వారంలో భూ సమస్యలపై ధరఖాస్తుల స్వీకరణ, రెండో వారం పరిశీలన, మూడో వారం స్థల పరిశీలనలు, నాల్గవ వారం సమస్య పరిష్కారంతో ముగుస్తుందన్నారు. వేసవికాలం కాబట్టి సమీపంలోని చెరువులు, వంకలను ఆక్రమించుకోరాదన్నారు. పొలాల మధ్య దారి, పాసుపుస్తకాల్లో తప్పులు దొర్లడం, అదే విధంగా లోటుపాట్లను సరిదిద్దడం వంటి సమస్యలు పరిష్కరింపబడతాయన్నారు. రైతులు రికార్డులతో వచ్చి సహకరించాలన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ, అటవీశాఖ, పంచాయతీరాజ్, నీటి పారుదలశాఖాధికారులు హాజరు కావాల్సివుంది. అయితే వారు గైర్హాజరయ్యారు. ఎ.కొత్తకోటలో దాదాపు వంద ఎకరాల భూమి దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధీనంలో వున్నట్లుగా రైతులు గగ్గోలు పెడుతున్నారు. దశాబ్దకాలం నుంచి సమస్యతో సతమతమవుతున్నామని తహశీల్దార్ పార్వతితో రైతులు మొరపెట్టుకొన్నారు. ఆయా భూముల్లో పాసుపుస్తకాలు



ప్రసంగిస్తున్న తహశీల్దార్ పార్వతి

న్నప్పటికీ ఎండోమెంట్‌లో ఉన్నాయని చూపిస్తున్నారనీ, దీంతో భాగపరిష్కారాలు, క్రయ, విక్రయాలు జరగలేదని వాపోయారు. సమాధానం చెప్పాల్సిన సంబంధితశాఖ గైర్హాజరు కావడంతో రైతులు వెనుతిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమావేశానికి రాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. ఎంపిడిఓ లీలామాధవి, ఆర్ఎస్‌డి దొరస్వామి, ఆర్ఐ భరత్, సర్వేయర్లు మురళి, సురేంద్రరెడ్డి, టిడిపి నాయకుడు మునిరాజ, పంచాయతీలోని రైతులు పాల్గొన్నారు.

# ఎ.కొత్తకోటలో మారని " స్వర్ణగ్రామం "..!

**చౌడేపల్లి, మే 7 ప్రభాతవార్త**

" ఊరంతా ఒకదారైతే ఉలిపిరి కట్టెది ఒకదారి " అన్న చందంగా తయారైంది పంచాయతీ అధికారుల తీరు. జిల్లా మారింది సచివాలయాల స్థానంలో స్వర్ణగ్రామం వచ్చింది. మండలం మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాల పాటించి బోర్డులు మార్పు చేసారు. ఎ.కొత్తకోటలో మాత్రం భిన్నంగా వుందని చూసినవాళ్ళందరూ నవ్వుకున్నారు. పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం చేసి 4నెలలు గడుస్తోంది. అదే విధంగా కూటమి ప్రభుత్వం సచివాలయాల స్థానంలో స్వర్ణగ్రామాలు ఏర్పాటు చేసింది. అయితే మండలస్థాయి అధికారుల పర్యవేక్షణాల లోపమో, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమో కానీ ఎ.కొత్తకోట ప్రభుత్వ భవనానికి పేర్లు మార్చక పోవడం గమనార్హం. బిడ్డ పోయినా మరులు పోవన్న సామెతను అందరూ గుర్తు చేసుకొన్నారు.



ఎ.కొత్తకోటలో పాత పేర్లతోనే ఉన్న స్వర్ణగ్రామ భవనం

# జుట్టు సమస్యలకు కాకర !

కాకరతో చేసిన వంటకాలు తినాలంటే అబ్బా.. చేదు అనుకోకుండా ఉండలేం. అయితే కాకరకాయ వల్ల మనకు ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్న విషయం తెలిసిందే. కాకర వల్ల కేవలం ఆరోగ్యానికే కాదు..



మన కురుల అందానికీ ఎంతో మేలు జరుగుతుంది. కాకర రసం తరచూ పట్టించడం వల్ల జుట్టు రాలే సమస్య తగ్గుముఖం పడుతుంది. అలాగే కుదుళ్ల దృఢంగా, కురులు ఒత్తుగా తయార వుతాయి. అలాగే దీనిలో ఉండే కుదుళ్ల దృఢంగా, కురులు ఒత్తుగా తయారవు తాయి. అలాగే దీనిలో ఉండే యాంటీమైక్రోబియల్ గుణాల వల్ల చుండ్రు, తలలో వచ్చే ఇతర ఇన్ఫెక్షన్లు దరి చేరకుండా ఉంటాయి. ఈ ప్రయోజనాలను పొందాలంటే ఏం చేయాలో తెలుసుకుందాం..

**జుట్టు రాలే సమస్యకు...** ఈ రోజుల్లోనఎంతోమంది ఎదుర్కొనే సమస్య జుట్టు రాలిపోవడం. ఈ క్రమంలో కాకర రసాన్ని ఉపయోగిస్తే ఈ సమస్య నుంచి బయటపడచ్చు. దీనికోసం అరకప్పుకాకర రసాన్ని తీసుకొని దానిలో చెంచా కొబ్బరి నూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు మొత్తానికి పట్టించాలి. మాడుకు కూడా రాసి ఐదు నుంచి పది నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఆ తర్వాత ముప్ఫై నుంచి నలభై నిమిషాల పాటు ఆరనివ్వాలి. అనంతరం గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఈ మిశ్రమాన్ని వారంలో రెండుసార్లు అప్లై చేసుకోవడం ద్వారా జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది.

**చివర్లు చిట్లితే...** మన ఉపయోగించే హెయిర్‌కేర్ ఉత్పత్తుల్లోని రసాయనాలు, బయట కాలుష్యం ప్రభావం కారణంగా జుట్టు చివర్లు చిట్లడం సాధారణ సమస్యగా మారిపోయింది. దీనిపై మనం తలస్నానం చేసే విధానం కూడా ప్రభావం చూపుతుంది. దీన్ని నివారించడానికి సరిపడినంత



కాకరకాయ రసాన్ని తీసుకొని కురులకు పట్టించాలి. 40 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చొప్పున చేస్తే.. మూడు వారాల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.

**చుండ్రు తగ్గించడానికి ....** కురుల విషయంలో తగినంత శ్రద్ధ వహించక పోవడం, పోషకాహారం తీసుకోక పోవడం, కాలుష్యం తదితర కారణాల వల్ల చుండ్రు సమస్య ఎదురవుతుంది. దీనికోసం కొద్దిగా జీలకర్ర తీసుకొని మెత్తటి పేస్ట్‌లా తయారుచేసుకోవాలి. దీన్ని కాకర రసంలో కలిపి దాన్ని మాడుకు అప్లై చేసుకోవాలి. కొంతసేపు ఆరనిచ్చి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు నుంచి మూడుసార్లు చేయడం ద్వారా చుండ్రు సమస్య నుంచి విముక్తి కలుగుతుంది.

**తెల్లజుట్టు సమస్యకు...** వివిధ కారణాల వల్ల కొంతమందిలో కుదుళ్ల వద్ద మెలనిన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా చిన్నవయసులోనే జుట్టు తెల్లగా మారిపోతుంది. ఇలాంటి వారు తెల్ల వెంట్రుకలు కనపడకుండా చేయడానికి హెయిర్‌డైని వేసుకుంటూ ఉంటారు. వీటిలోని రసాయనాల వల్ల జుట్టు పాడయ్యే అవకాశం ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే కాకరను ఉపయోగించడం మంచిది. దీనికోసం సరిపడినంత కాకర రసాన్ని తీసుకొని దాన్ని వెంట్రుకల కుదుళ్ల నుంచి చివరి దాకా పట్టించి గంట పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా కొన్ని రోజులపాటు చేయడం వల్ల తెల్లజుట్టు తగ్గుముఖం పడుతుంది.

**పొడిబారిన జుట్టుకు..** కాకర రసం, పెరుగు అరకప్పు చొప్పున తీసుకోవాలి. వీటికి రెండు చెంచాల నిమ్మరసం జత చేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో కొంత భాగాన్ని మాడుకు పట్టించి కాసేపు మునివేళ్లతో మృదువుగా మర్దన చేయాలి. మిగిలిన భాగాన్ని వెంట్రుకలకు మొత్తం పట్టించి ముప్ఫై నిమిషాల పాటు అరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

# బౌ..బౌ..బౌ అంటూ భయపెడుతున్న కుక్కలు

## పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పిల్లలపై తిరగబడుతున్న వైనం

**పీలేరు, మే 7 ప్రభాతవార్త :**

పీలేరులోని ప్రధానంగా ఆర్టీసి, తిరుపతి బస్టాండు సర్కిల్, కడపక్రాస్, పట్టణంలోని పురవీధుల్లో ఎక్కడ చూసినా జనసంచారం గల ప్రాంతాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు వీధుల్లో తిరుగుతున్న కుక్కలపై ఎలాంటిచర్యలు చేపట్టలేకపోతున్నారు. రాత్రింభవళ్ళు యదేచ్ఛగా వీధి కుక్కలు హల్‌చల్ చేస్తుండడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పాదచారులపై శునకాలు విరుచుకుపడుతున్నాయి. చిన్నపిల్లలు ఇంటికి వస్తుంటే పిల్లలను కరవడానికి వస్తున్నాయి. వీటి నుంచి రక్షించుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా బస్టాండు అవరణంలో అనేక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు కుక్కకాటుకు గురై కొందరు నిమ్నకుండిపోతున్నా, మరికొందరు జంకుతున్నారు. పట్టణంలోని ప్రధానంగా ఆర్టిసిబస్టాండు, తిరుపతి క్రాస్‌రోడ్డు, చిత్తూరు క్రాస్‌రోడ్డు, కడప క్రాస్‌రోడ్డు, ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయం ముందు, పలు థియోటర్ల ముందు, సంత ప్రాంతాలు, వివిధ



భౌ..భౌ అంటూ అరుస్తున్న శునకం, గుంపులు గుంపులుగా తిరుగుతున్న శునకాలు

వీధులతో పాటు సందు సందులోనూ గుంపులు గుంపులుగా శునకాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ఈ సునకాలను సంబంధితఅధికారులు పట్టుకొని దూరంగా వదిలివేయాలని పలువురు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల వేగవంతమైన పరిష్కారమే లక్ష్యం

## తహసీల్దార్ భాగ్యలత



**గాలివీడు, మే7, ప్రభాతవార్త :**

గ్రామస్థాయిలో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన "ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు" కార్యక్రమం చేపట్టినట్లు తాసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని పేరంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డివారిపల్లెలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అలాగే అసైన్డ్ భూముల వివరాలు, సెక్షన్ 22తి కింద నిషేధిత ఆస్తుల సమాచారం, గ్రామ ట్యాంకులు మరియు నీటి వనరుల పరిస్థితి, ప్రభుత్వ భూముల వివరాలను అధికారులు పరిశీలించారు. హౌసింగ్ లేఅవుట్లలో ఖాళీ ప్లాట్ల ధృవీకరణతో పాటు "అందరికీ ఇళ్లు" పథకానికి సంబంధించిన దరఖాస్తులను కూడా పరిశీలించారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను అదే రోజు జీపీఆర్ఎస్ లో అప్‌లోడ్ చేసి, సులభమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కోర్టు సంబంధిత లేదా క్లిష్టమైన చట్టపరమైన అంశాలు మినహా మిగిలిన సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దామోదర్ రెడ్డి, ఆర్ఐ భవానీ శంకర్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి గుర్తింపుకు అధునాతన పరికరం హెచ్ హెచ్ ఎక్స్ రే



ఎక్స రే తీస్తున్న దృశ్యం

**పెద్దమండెం మే 7 ప్రభాతవార్త**

క్షయ వ్యాధి గుర్తింపునకు ప్రభుత్వం అధునాతన హెచ్ హెచ్ ఎక్స రే ను పెద్దమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి అందుబాటులోకి తెచ్చింది. టిబి ముక్తభారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమాన్ని పిహెచ్సి సిబ్బంది చేపట్టింది ఈ సందర్భంగా ఎక్సరేను వినియోగించి క్షయ వ్యాధిని క్షణాల్లో గుర్తించడం జరుగుతుందన్నారు ఇప్పటికే 170 ఎక్సేలు తీయడం జరిగిందన్నారు. టీ బి హైయెస్ట్ గల పెద్దమండెం కలిచర్ల గ్రామాలను జిల్లా అధికారులు గుర్తించారు ఆరోగ్య భద్రత కొరకు రెండు వారాలు మించి దగ్గు రావడం చాతి నొప్పి సాయంత్రం వేళల్లో జ్వరం రావడం తగ్గినప్పుడు రక్తం రావడం బరువు తగ్గడం ఆకలి లేకపోవడం ఈ లక్షణాలు ఉన్నవారు స్థానిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ హెచ్రే ఉచితంగా తీయడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం శుక్రవారం ఎక్సరేలు తీయడం జరుగుతుందన్నారు అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని వైద్యులు కోరారు ఈ కార్యక్రమంలో. డాక్టర్ హరి వర్మ అశోక్ చైతన్య సిహెచ్ఓ మురళీధర్ మురళీధర్ టీవీ సూపర్వైజర్ రామకృష్ణ నాయుడు టీబీ టెక్నీషియన్ భూపతి ఏఎన్ఎం ప్రమీల ఆశా వర్కర్లు పాల్గొన్నారు

# బస్టాండ్ లో పరిశుద్ధం డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టిన అధికారులు



జెసిబి తో పరిశుద్ధ పనులు చేస్తున్న దృశ్యం

**పెద్దమండెం, మే 7. ప్రభాతవార్త:**

మండలంలోని బస్టాండ్ కూడలిలో పేరుకుపోయిన చెత్తాచెదారం మట్టిని డ్రైనేజీ కాలువలను జెసిబితో తొలగిస్తూ పారిశుద్ధ పనులను పెద్దమండెం కార్యదర్శి పంచరత్న ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు ఈ సందర్భంగా బస్టాండ్‌లో రోడ్డుకు ఇరువైపులా మట్టితో పూడకపోయినా డ్రైనేజీ కాలువలను తొలగిస్తూ రోడ్డు విశాలం చేయడం జరుగుతుందని అన్నారు. బస్టాండ్ కూడలిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే ట్రాఫిక్ సమస్యలను సృష్టిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రోడ్డును ఆక్రమించడంతో వాహనాలు రాకపోకలకు జాప్యం జరుగుతుంది దీంతో వాహన దారులు ఇబ్బందులకు గురవుతున్నారు బస్టాండ్ కొడలిలో ఆక్రమణ తొలగించి రోడ్డును వెడల్పు చేసి రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన ఆర్ అండ్ బి అధికారులు పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ట్రాఫిక్ సమస్యపై చర్యలు తీసుకోండి

## కమిషనర్‌కు బివైఎస్ నాయకులు వినతి

**మదనపల్లె, మే 7 ప్రభాతవార్త**

పట్టణంలో ప్రధానంగా సిటి ఎం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాల సెల్లార్లను దుకాణాలుగా మార్చడం వల్ల ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యపై బహుజన



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

యువసేన నాయకులు పునిత్‌కుమార్ గురువారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిటిఎం రోడ్డులోని అన్ని వాణిజ్య సముదాయాలలో పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లను అక్రమంగా దుకాణాలుగా మార్చి వ్యాపారాలు సాగిస్తున్నారన్నారు. దీని వల్ల కస్టమర్లు తమ వాహనాలను రోడ్డుపై నిలుపుతుండడంతో ప్రజలు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్ల విస్తరణ పేరుతో పెద్దచెట్లను తొలగించడం వల్ల వాహనాల పార్కింగ్‌కు ఖాళీ స్థలాలను ఉపయోగిస్తున్నారన్నారు. అధికారులు విచారణ జరిపి సిటిఎం రోడ్డులోని భవనాలను తనిఖీ చేసి అక్రమ సెల్లార్‌లో ఉన్న దుకాణాలను తొలగించి పార్కింగ్‌కోసం ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పెద్దేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం జరిగేది ఎప్పుడో!

తంబళ్లపల్లె మే 7 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండల శివార్లలోని చౌడ సముద్రం సమీపంలో పెద్దేరు వాగు పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు మొరపెట్టుకున్నా స్పందించే నాయకుడు కరువయ్యాడు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ పెద్దేరు వాగు పొంగితే ఈ రహదారిలో రాకపోకలు బంద్ అవుతాయి. తంబళ్లపల్లె నుండి మొలకలచెరువు వయా కదిరి రహదారితో పాటు బెంగళూరు వెళ్ళడానికి ఈ రహదారి కేంద్ర బిందువుగా నిలిచింది. ఈ బ్రిడ్జి నిర్మాణం పై గత ప్రభుత్వం మాటలకే పరిమితం కాగా నేటి కూటమి ప్రభుత్వంలో హామీ ఇచ్చిన ఇప్పుడే కాన రాలేదు. ఈ వాగు పొంగిన సమయంలో మండలానికి చెందిన రెండు పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలకు ఆటంకం ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం 2047 విజన్ లో భాగంగా పెద్దేరు వాగుపై బ్రిడ్జి తో పాటు కొట్టాల బ్రిడ్జి, పెద్దేరు ప్రాజెక్టు కింద బ్రిడ్జి నిర్మాణాలు చేపడితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని



ప్రజలు కోరుతున్నారు.

# రెవిన్యూ సమస్యలు పరిష్కరించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యం

## గండికోట సుధాకర్

**రాయచోటి మే 7 ప్రభాతవార్త :**

రెవిన్యూ సమస్యలు పరిష్కరించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రూరల్ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ అన్నారు. రాయచోటి నియోజకవర్గం వ్యాప్తంగా మంత్రి మండిపల్లి



రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని ఆయన పేర్కొన్నారు. ఈరోజు రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామంలో గురువారం రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు రాయచోటి తహసిల్దార్ నరసింహ కుమార్ అధ్యక్షతన ప్రజా ఫిర్యాదుల వేగమంతమైన పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గండికోట సుధాకర్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో రెవిన్యూ శాఖలో జరిగిన తప్పిదాల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రెవిన్యూ సమస్యలతో రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల వేగవంతమైన పరిష్కారం కార్యక్రమం ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు అనే వినూత్నమైన కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి, గ్రామ టిడిపి నాయకులు నాగార్జున రెడ్డి, వేణుగోపాల్, హరినాథ, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యం రానివ్వని ఉల్లికాడలు

వంటకు రుచిని అందించే ఉల్లికాడలు ఆరోగ్యాన్నీ పరిరక్షి స్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు సహా పలు పోషకాలు మెండుగా ఉండే వీటివల్ల కలిగే మరిన్ని ప్రయోజనా లను తెలుసుకుందాం.



- ✦ రోజూ వంటల్లో ఈ కాడల ను ఉపయోగించడం మంచిది. వీటిలోని విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలో వ్యాధినిరోదక శక్తిని పెంచి, సీజన్లలో వచ్చే అనారోగ్యాలను దరికి చేరనివ్వవు. అలాగే వీటిలోని యాంటీ ఈ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లకు గురికాకుండా పరిరక్షిస్తాయి. దగ్గు, జ్వరం ఉన్నప్పుడు ఈ కాడలతో చేసే సూప్ ఉపశమనాన్ని అందిస్తుంది.
- ✦ మెనోపాజ్ తర్వాత కాల్షియం లోపించడంతో ఎముకలు బలహీనపడతాయి. ఈ సమస్యను అధిగమించాలంటే తరచూ ఉల్లికాడలను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వీటిలోని కాల్షియం, కె విటమిన్ ఎముకలను బలంగా ఉంచుతాయి. అలాగే వీటిలోని సి విటమిన్ రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గించి హృద్రోగాలను దరి చేరనివ్వదు.
- ✦ ఉల్లికాడల్లోని పీచు జీర్ణశక్తిని మెరుగ్గా ఉంచుతుంది. దీనివల్ల మలబద్ధక సమస్య ఉండదు. అధికబరువుకు దూరంగా ఉండొచ్చు. అలాగే వీటిలోని ఎ,సి,కె విటమిన్లు, కెరోటి నాయిడ్స్ కంటి ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతాయి.
- ✦ వీటిలోని బయోఫ్లావనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ప్యాంక్రియాటిక్, పేగు కాన్సర్ వంటివి దరి చేరకుండా చేస్తాయి. అధిక ఈస్ట్రోజన్‌ను తొలగించే సామర్థ్యం ఉల్లికాడల్లో ఉంటుంది. ఇవి రొమ్ము కాన్సర్‌ను నిరోధిస్తాయి.
- ✦ ఈ కాడల్లోని యాంటీ ఆక్సిడెంట్స్, పొటాషియం చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిలోని అమినోయాసిడ్స్ చర్మకణాల ఉత్పత్తికి దోహదపడతాయి. సాగే గుణాన్ని తేమని అందిస్తాయి. చర్మాన్ని పొడిబారకుండా ఉంచడంతో వృద్ధాప్య లక్షణాలు త్వరగా దరిచేరవు.
- ✦ వీటిలోని మెగ్నీషియం కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఉల్లికాడల సూప్ తీసుకుంటే కండరాల నొప్పుల నుంచి ఉపశమనాన్ని పొందొచ్చు. అలాగే ఉల్లికాడల్లో పుష్కలంగా ఉండే సల్ఫర్ సమ్మేళనాలు మన శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతాయి. దీనివల్ల మధుమేహ సమస్యకు దూరంగా ఉండొచ్చు.

# డ్రైవర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

## అన్నమయ్య జిల్లా రవాణా అధికారి

**రాయచోటి మే 7 ప్రభాతవార్త :**

డ్రైవర్ యొక్క అర్హతలు, మరియు భద్రతా ప్రమాణాల గురించి, ఫైర్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి ట్రాన్స్పోర్ట్ కమీషనర్, విజయవాడ ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రవాణా అధికారి రాయచోటి నియోజక పరిధిలోని 8 మండలాలలో ఉన్న స్కూల్ బస్సులను ఈరోజు తనిఖీ చేయడం జరిగిందని ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ తనిఖీలో స్కూలు బస్సులు కి ఉండవలసిన డాక్యుమెంట్స్, డ్రైవర్ యొక్క అర్హతలు, మరియు భద్రతా ప్రమాణాల గురించి, ఫైర్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి మరియు ఆ బస్సులో మంటలను ఆర్పేందుకు ఉండవలసిన పరికరాల గురించి తనిఖీ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు సుమారు 60 బస్సులు తనిఖీ చేసినట్లు తెలియజేశారు. వాహనానికి సంబంధించిన రికార్డులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్నెస్, పర్మిట్, టాక్స్, ఇన్సూరెన్స్, పొల్యూషను వ్యాలిడిటీలతో ఉండాలని తెలిపారు. స్కూల్ బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు హెవీ మోటర్ వాహనం నడిపే డ్రైవింగ్ లైసెన్సు మరియు హెవీ మోటర్ వాహనం నడుపుటలో ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి మరియు అతనికి 60 సంవత్సరాల లోపు వయసు ఉండాలన్నారు. ప్రతి బస్సుకి బస్సు పిల్లల్ని తీసుకెళ్తున్నప్పుడు ఒక అటెండర్ కూడా ఉండాలి. స్కూలు బస్సుకు మొదటగా స్కూలు యొక్క పేరు, అడ్రస్సు, ఫోన్ నెంబరు బస్సుకి ముందు వెనక కుడివైపు ఎడం వైపు అన్ని వైపులా నీటిగా కనపడే విధంగా పెయింటింగ్ చేసి ఉండాలన్నారు. బస్సు ఫుట్ బోర్డు యొక్క హైట్ నేల నుంచి 325 కంటే ఎక్కువ ఉండరాదు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ విత్ కిట్ ఉండాలి. వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైస్ ఫిట్ చేసి ఉండాలి. ఫైర్ ఎక్సటింగుషేర్ మినియం



1మరియు డ్రై పౌడర్ ఇంజన్ కంపార్ట్మెంట్లో అందుబాటులో ఉండాలి. 01.04.2019 తర్వాత రిజిస్టర్ అయిన వాహనాలకి ఫైర్ డిటెక్షన్ మరియు అలారం సిస్టం (నీదీతిళీ) ఉండాలి. 01.04.2020 నుండి రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకి ఫైర్ డిటెక్షన్ మరియు సప్రెషన్ సిస్టం (నీదీళీళీ) ఇంజిన్ కంపార్ట్మెంట్లో ఉండాలి. 01.10.2023 నుండి రిజిస్టర్ అయిన వాహనాలకు ఫైర్ అలారం మరియు ప్రొటెక్షన్ సిస్టం (నీతిశీళీ) పాసెంజర్ కంపార్ట్మెంట్లో బిగించి ఉండాలన్నారు. ఎమర్జెన్సీ మరియు పానిక్ బటన్ ప్రతి సీటుకు బిగించి ఉండాలన్నారు. విద్యార్థుల భద్రతా విషయంలో స్కూల్ యాజమాన్యాలు నిర్లక్షయం వహించరాదన్నారు. తల్లిదండ్రులు కూడా అప్రమత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై జరిమానాలు, వాహనాల సీజ్, ఫిటినెస్ సర్టిఫికెట్ రద్దు వంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# పశుగ్రాసం లేక నష్టాల బాటలో పాడి రైతులు

**తంబళ్లపల్లె మే 7 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలంలోని పాడి రైతులు పశుగ్రాసం లేక వేల రూపాయలు ఖర్చు చేసి పశుగ్రాసం కొనలేక పాడి ఆవులను తెగ నమ్ముకుని నష్టాల బాటలో పయనిస్తున్నారు. మండలంలో రైతులు, కూలీలకు జీవనాధారంగా నిలిచిన పాడి పరిశ్రమ పశుగ్రాస కొరతతో



కుదేలైంది. గత ఖరీఫ్ సీజన్లో ప్రతి ఇంటికి పాడియావు కలిగి పాల దిగుబడితో తమ కుటుంబాలను నెట్టుకొస్తూ వచ్చారు. అయితే గత రెండు మాసాలుగా సమీప ప్రాంతాలలో గల కొండలు గుట్టలు అగ్నికి ఆహుతి కాగా తీవ్ర పశుగ్రాసం కొరత ఏర్పడింది. కొందరు రైతులు విధి లేని పరిస్థితుల్లో పక్క జిల్లాలు, రాష్ట్రాల నుండి వేరుశెనగ చెక్క, వరిగడ్డి ఒక్క లోడు రూ 25 వేల నుండి రూ 30 వేల వరకు ఖర్చు చేసి దిగుమతి చేసుకుని పాడియావులను సంరక్షించుకుంటుండగా ఆర్థిక స్తోమత లేని రైతులు పశుగ్రాసం కొనలేక పాడి పశువులను ఆయన కాడికి అమ్ముకుంటున్నారు. తరచూ కరువు బారిన పడుతున్న తంబళ్లపల్లె పాడి రైతులను సబ్సిడీ పశుగ్రాసం తో పాటు పశువుల దాణా పంపిణీ చేయాలని స్థానిక పాడి రైతులు కోరుకుంటున్నారు.

